


"వెళ్తున్నాను, జాగర్త!" అంటూ భర్త నాగేంద్రం వీధిలోకి నాలుగడుగులు వేసిన తరవాత. బాపమ్మ కుడిచేతిని కొంచెం పైకెత్తి, "వెళ్ళిరండి!" అని గొణిగింది.

ప్రతి శుక్రవారం సాయంత్రం అతడు యిలాగే అంటూండడం, తను అదే విధంగా వినడం, వెనక 'వెళ్ళిరండి' అని దీవిస్తూండడం గడచిన నాలుగు సంవత్సరాల నుంచీ జరుగుతున్న విషయం. ఏ వొక్కసారైనా తను ఆ దీవించడం మరిచిపోయివున్నా, లేక 'వెళ్ళిరండి' అనేమాటకు బదులు పొరపాటున 'వెళ్ళండి' అని అన్నా, ఎంత ప్రమాదం జరిగివుండేదో ఆమెకు తెలుసు. అందుకనే ప్రతి శుక్రవారం వుదయం నుంచే 'వెళ్ళిరండి' అనే ఆ దివ్యవాక్యాన్ని తిరిగి తిరిగి మననం చేస్తూ తీరా సాయంకాలానికి భర్త 'వెళ్ళుతున్నాను' అంటే 'వెళ్ళిరండి' అని, చప్పున తను అనేసేది.

బాపమ్మకు భర్త నాగేంద్రం అంటే కొంత అసంతృప్తీ, నిరాశా అప్పుడప్పుడూ కలుగుతూండే మాట నిజం. దానికి నిజమైన కారణం లేకపోలేదు.

తను పతిభక్తిగల ఉత్తమ యిల్లాలుగా ఆ భర్త కోసం ఎటువంటి త్యాగాన్నైనా చేయడానికి సిద్ధమే. భర్త వారానికి వచ్చే ఆ రెండు శెలవ రోజున్నే కాక అసలు బడిపంతులు వుద్యోగానికే రాజీనామా పెట్టి, మొత్తం వారం రోజులూ అక్కడే ఆ కామాక్షితో, లేక అతనికి నచ్చిన మరే

స్త్రీతోనైనా ఆనందంగా కాలం గడిపినా సహించి వూరుకోగలదు. ధర్మపత్నిగా భర్త ఆనందాన్నీ, సౌఖ్యాన్నీ ఎక్కడ నుంచి, ఏ రూపంలో పొందగలిగినా, చూసి తనూ సంతోషించడం కాక, తన క్కావలసింది ఏముంది?

కాని నాగేంద్రంలో యీ మధ్య అప్పుడప్పుడూ హఠాత్తుగా సంభవిస్తూన్న మార్పుల్ని చూస్తుంటే ఆమెకు విచారమూ, నిరాశా కలగసాగింది.

"బాపీ! నిన్ను చాలా బాధపెడుతున్నాను. కాని ఏం చేసేది? ఆ కామాక్షి నన్ను బానిసగా చేసుకుంది. అయినా, ఎప్పటికైనా యీ అవినీతి మార్గం నుంచి మారి నిన్ను క్షమాపణ అడిగేరోజు రాకపోదు" అన్నప్పుడు, ఆమె విపరీతమైన బాధతో కుమిలిపోయేది.

"మీరు ఆ వొక్క కామాక్షితోనే కాక మరెందరిదగ్గర కెళ్ళినా నాకు బాధలేదు. మీ ధర్మపత్నిగా మీ సుఖం, ఆనందంకాక నేను కోరదగింది ఏముంది?"

అలాంటి సమయాల్లో నాగేంద్రం ఆమెను దగ్గరగా తీసుకుని ముద్దులతో నలిపేస్తూ, "నువ్వు నా దేవతవి, పూర్వజన్మ సుకృతంవల్ల భార్యగా దొరికావ్" అంటూ బుగ్గల్ని గట్టిగా వత్తి, పైపంచ వేసుకుని, నిట్టూరుస్తూ కామాక్షి దగ్గిరకి వెళ్ళిపోయేవాడు.

వెళ్తున్నానని చెప్పి వేగంగా నడిచిపోతున్న భర్తని రోడ్డు మూల తిరిగిందాకా చూసి, బాపమ్మ బరువెక్కిన హృదయంతో తలుపు గడివేసి పందిరిమంచం మీద నడుం వాల్చింది. నిన్న సాయంత్రం శాస్త్రిగారి యింటికి వచ్చిన సోమమ్మతో మాట్లాడిన దగ్గర నుంచీ, ఆమె మనశ్శాంతిని కోల్పోయింది. దొంగతనాలూ, హత్యలూ చేసిన వాళ్ళతోపాటు వ్యభిచారులు కూడా తప్పక నరకానికే వెళ్తారని ఆమె దృఢంగా చెప్పినప్పుడు, బాపమ్మ హృదయం వేగంగా కొట్టుకున్నది. ఆమెకు వెంటనే తన భర్త విషయం గుర్తుకొచ్చింది. అతడు గడిచిన నాలుగు సంవత్సరాల నుంచి చేస్తున్నది ఏమిటి? అయినా అంత మంచివాడు, సహృదయుడు యీ స్వల్పానికి యమలోకం వెళ్ళవలసి వుంటుందనేది ఆమె నమ్మలేక పోయింది. భర్తను నరక బాధల నుంచి తప్పించలేని తన పతిభక్తి, పాతివ్రత్యం ఎందుకు? భయం భయంగానే సోమమ్మను ప్రశ్నించింది.

"ఆ వ్యభిచారి ఓ గొప్ప పతివ్రత భర్త అయి వుంటే?"

సోమమ్మ ఏమాత్రం ఆలోచించకుండా ఠక్కున జవాబిచ్చింది.

"ఇతర స్త్రీల పాతివ్రత్యాన్ని హరించేవాడనీ, వాడి సౌందర్యాన్నీ పాతివ్రత్యం నరక బాధల్నుంచి కాపాడలేదు"

బాపమ్మ అక్కడే పైత్యపుతెర వచ్చి పడిపోయేంత పని జరిగింది. యింట్లో ఏదో అవసరమైన పని వున్నదంటూ చప్పున అక్కడ నుంచి బయలుదేరి వచ్చేసింది.

పందిరి మంచం మీద అటూ యిటూ వేగంగా రెండుసార్లు పొర్లి బాపమ్మ తన భర్తను గురించి ఆలోచించ మొదలు పెట్టింది. ఎంత మనోవ్యాకులాన్నైనా సరే యిట్టే మాన్పి, నిర్మల శాంతిని కూర్చేవి ఆమెకు అతణ్ని గురించిన వూహలే! కామాక్షి దగ్గర అతడికి ఏమీ ప్రమాదం జరక్కుండా వుండాలనీ, ఆమె భర్త నుంచి గాని లేక ఆమెకు వున్న యితర ప్రియుల్నించిగాని తన

భర్తకు ఏమీ ఆపద సంభవించకుండా కాపాడమనీ, భగవంతుడ్ని ప్రార్థించింది.

నాలుగు సంవత్సరాల నుంచి తను చేసే ప్రార్థనల్ని ఆలకించి భర్తకు ఏ ప్రమాదం రాకుండా కామాక్షితో వ్యవహారం సవ్యంగా జరిగిపోయేట్టు చూస్తున్న ఆ దేవదేవుణ్ని, ఆయనను ఈ ఇహలోక యాత్ర చాలించిన తరవాత, నరకానికి తోయకుండా, తనతోపాటు స్వర్గానికి వొచ్చేటట్టు చూడమని వేడుకుంటే, తన కోర్కెను తోసేస్తాడా? విష్ణుమూర్తి పరమభక్తుల కోర్కెల్ని కాదన్న సందర్భాలు వున్నయేమోగాని, పతివ్రతల అభీష్టాన్ని పెడచెవిన పెట్టిన సందర్భాలు ఏ పురాణంలోనూ లేవు.

బాపమ్మ మంచం దిగి, లక్ష్మీ సమేతంగా వున్న విష్ణుమూర్తి పటం ముందు చేతులు జోడించి కళ్లు మూసేందుకు సిద్ధపడుతున్న సమయంలో, హఠాత్తుగా వాకిలి తలుపు ఎవరో గట్టిగా కొట్టారు.

ఆమెకు యిదో బరువైన అపశకునంలా తోచింది. నిస్సత్తువగా, జాలిగా తలుపు వంక చూసింది. మళ్ళీ తలుపు గట్టిగా కొట్టిన శబ్దం, పెద్ద కేక –

"బాపమ్మగారూ! బాపమ్మగారూ!"

ఆమె జోడించిన చేతుల్ని తిరిగి స్వాధీనంలోకి తెచ్చుకుని, ప్రార్థనా వాక్యాల్ని గొంతులో నుంచి జారిపోకుండా బిగపట్టి తలుపు తెరిచింది.

"మా అమ్మ మిమ్మల్ని వెంటనే రమ్మంది" – శాస్త్రిగారి కూతురు రొప్పుతూ చెప్పింది.

"ఎందుకు?"

"మంచి మంచి పటాలు అమ్మకానికి వచ్చినై. మీరు వెంటనే రండి! నేను బొమ్మలు చూడాలి వెళ్తున్నా!" – ఆ అమ్మాయి యీ మాటలు చెపుతూనే తుర్రున పరుగెత్తింది.

బాపమ్మ అక్కడే ఓ నిమిషం తమాయించింది. ప్రార్థన పూర్తిచేసి వెళ్ళడమా లేక ముందుగా పటాలు చూసిరావడమా? దేవుణ్ని ప్రార్థించేందుకు సమయాసమయాలు లేవనేది ఆమెకు జ్ఞాపకం వచ్చింది. తలుపు గొళ్ళెం పెట్టి శాస్త్రిగారి యింటి వైపున నడిచింది.

శాస్త్రిగారి యింటి పంచసాలీ అంతా కోలాహలంగా వుంది. పటాలు అమ్మేవాడు ఐదారు గజాలమేర అంతా రకరకాల బొమ్మలు పరిచి, కొన్నిటిని చేతిలో ఎత్తి చూపెడుతూ వుపన్యాసం దంచుతున్నాడు.

"యీయన యిప్పుడిప్పుడే పేరులోకి వస్తున్న దేవుడు! భక్తులందరికీ సమాధిలో నుంచి రక్షణ యిస్తాడు"

"గుంటూరు మస్తాను కన్నా, హరనాథ్ కన్నా గొప్పవాడా?" – శాస్త్రిగారి భార్య ప్రశ్నించింది.

"అవునమ్మా! అందరికంటే గొప్పవాడు. నిన్న యీ వూళ్లో యిరవై పటాలు అమ్మాను. అప్పుడే కొన్ని అద్భుతాలు కనబడినై అని, తెల్లవారి నాతో కొందరు చెప్పారు. పైగా తక్కిన అన్ని పటాలకంటె చౌక"

బాపమ్మ పెదిమ విరుస్తూ, శాస్త్రిగారి భార్య వైపుకు చూసి, "భర్త కంటె మనకు యితర దేవుళ్ళు ఎందుకండి?" అన్నది.

సోమమ్మ పళ్ళువూడిపోయేంత పెద్దగా నవ్వుతూ – "అదేనండి, నేను మా సావిత్రితో చెబు

తున్నాను. స్త్రీకి భర్త కంటే యితర దైవాలు ఎక్కడున్నారు?"

పటాలమ్మేవాడు అందరి మొహాలవంకా ఓమారు చూసి తక్కున పక్కన వున్న పెద్ద ట్రంకులో చేయి పెట్టి, అడుగు నుంచి ఓ పెద్ద బొమ్మల కట్ట బయటికి లాగాడు.

"యిదే పరమపదసోపానపటం. యిది స్వర్గలోకం. పుణ్యాత్ములు వుండేది. యిది నరకం. పాపాత్ములు వెళ్ళేచోటు..."

బాపమ్మ మధ్యలోనే అందుకుని, "ఏదీ! ఏదీ!" అంటూ చేయి చాచింది.

"స్వర్గలోక పటమా!" – పటాలవాడు ప్రశ్నించాడు.

"కాదు. నరకలోకం"

వాడు నవ్వుతూ అందించాడు.

ఆమె వణుకుతున్న చేతుల్తో అందుకున్నది.

ఆమె ఒక దృశ్యాన్నుంచి మరో దృశ్యానికి చక చకా చూసుకుంటూ పోతోంది. ఆమెకు కావలసింది హత్యలు చేసేవాళ్లు ఎలాంటి నరక బాధలు అనుభవించేదీ, దొంగతనాలు చేసేవాళ్ళని యమకింకరులు ఎలా హింసించేదీ కాదు.

ఆఖరుకు తనకు కావలసిన దృశ్యం కంటబడింది. ఆమె భయంతో చిన్న కేక వేసి, పటాన్ని చేతిలోనుంచి జారవిడిచి అక్కడే కూలబడింది.

సోమమ్మ తొందరగా ఆమె దగ్గిరకు వచ్చి చెయ్యి పట్టుకుంటూ, "ఏం జరిగింది బాపమ్మగారూ! ఏం జరిగింది?" అన్నది.

"నరకలోకమండీ! నరకలోకం! ఆఖరికి యముడికి కూడా పక్షపాత బుద్ధి"

పటాలవాడు, సావిత్రీ తెల్లబోయారు.

సోమమ్మ మాత్రం నిబ్బరంగా ఆమె పక్కన కూర్చుంటూ "ఏమిటా పక్షపాతం?" అని ప్రశ్నించింది.

బాపమ్మ ఊపిరి గట్టిగా పీలుస్తూ, తడబడే మాటల్తో అన్నది.

"దొంగతనాలూ, హత్యలూ, చేసిన వాళ్ళకంటే వ్యభిచారం చేసిన వాళ్ళకు పెద్దశిక్ష!"

"ఓహో! అంతేగదా. ఫరవాలేదు. వ్యభిచారులకు అంత శిక్షా పడాల్సిందే"

బాపమ్మకు వళ్ళు మరిచిపోయేంత కోపం వొచ్చింది. సోమమ్మ గొంతును రెండు చేతుల్తో గట్టిగా పట్టుకుని నలిపేద్దామన్నంత వుద్రేకం కలిగింది. కాని ఆమె ఆ వుద్రేకాన్ని గట్టిగా పళ్ళు కొరకడం ద్వారా, గాలిని మరో చిటికెడు అధికంగా పీల్చడం ద్వారా అణిచిపెట్టి, "అయితే, వాళ్ళ భార్యల గతేంకాను?" అన్నది.

సోమమ్మ జవాబు కోసం ప్రయత్నంచేసే లోపలే, పటాలవాడు ఓ బొమ్మను ముందుకు పెడుతూ, "చూడండి! యిక్కడ – యీ స్వర్గంలో హాయిగా పూలచెట్ల కింద దేవతలతో కాలం గడుపుతున్నారు" అన్నాడు.

"భర్త నరకంలో యినపముక్కు కాకుల వల్ల హింసించబడుతూ, యమకింకరుల చేత నిప్పుల్లోకి తోయబడుతూవుంటే, భార్య స్వర్గలోకంలో పూలచెట్ల కింద కాలం గడపడం న్యాయమేనంటావా?

అది పతివ్రత లక్షణమేనా?"

తీవ్రంగా, సూటిగా, నిలదీసినట్టు అడిగిన బాపమ్మ ప్రశ్నకు వెంటనే సోమమ్మ జవాబు చెప్ప లేకపోయింది. ఆమె ఓ నిమిషం ఆలోచించి తడబడుతూ, "మనం ఏం చేయగలం? అది దైవ శాసనం. పాపాత్ములు నరకానికీ, పుణ్యాత్ములు స్వర్గానికీను" అన్నది.

"దైవశాసనాన్ని ధిక్కరించి సూర్యచంద్రాదుల్ని కూడా గడగడలాడించిన పతివ్రతలు ఎంతమంది లేరు? అసలు వీళ్ళు, ఆ స్వర్గంలో కులక్కపోతే, భర్తలతోపాటు నరకానికే ఎందుకు పోగూడదు?"

సోమమ్మ ముక్కు మీద వేలు వేసుకుని, బాపమ్మ, మొహంలోకి చూస్తూ, "మీరు చెప్పింది అసంభవమండీ బాపమ్మగారూ! పతివ్రతల్ని నరకానికి తీసుకుపోవడానికి ప్రయత్నిస్తే – ఆఖరికి ఆ యముడు కూడా భస్మమై పోతాడు" అన్నది.

బాపమ్మ జవాబేమీ చెప్పకుండా ఓ రెండు నిమిషాలు తలవంచుకుని కూర్చుని చప్పున పటాలవాడి వైపుకు తిరిగి, "ఆ బొమ్మ ఖరీదెంత?" అన్నది.

"ఏ బొమ్మా?"

"నరకలోకం" – ఆమె పళ్ళు పటపట కొరికింది.

"మూడు పావలాలు"

"అయితే పటం యిటు యివ్వు. యింటికి రా డబ్బులిస్తా"

వాడు గుండ్రంగా మడచి, కాయితంలో చుట్టుబోతున్న పటాన్ని చప్పున చేతులోనుంచి లాక్కుని బాపమ్మ యింటి వైపున నడిచింది.

ఆ రాత్రి బాపమ్మ వంట చేసుకోలేదు. పటాన్ని ఎదురుగా గోడకు తగిలించి, పందిరి మంచం మీద పడుకుని రెప్పవాల్చకుండా దానివైపుకే చూస్తూ, మధ్య మధ్య పిచ్చిదానిలా జుట్టు పీక్కుంటూ నడిరేయివరకు అంతూపొంతూ లేని ఆవేదనల్తో కాలం గడిపింది. విషయాన్ని ఎన్ని రకాలుగా తిప్పి, కలగాపులగం చేసి, విడదీసి ఆలోచించినా ఆమెకు ఒకటిమాత్రం స్పష్టంగా కనబడుతోంది.

తన భర్త కామాక్షితో గడచిన నాలుగు సంవత్సరాల నుంచీ చేస్తున్నది పాపకార్యం. దానికి శిక్ష నరకలోకంలో యమకింకరుల శూలపు దెబ్బలూ, యినపముక్కు కాకుల కఠినమైన ముక్కు పోట్లూ! అయితే తను చేయగలిగిందేమిటి? అందరు పతివ్రతలలాగానే తనూ భర్తను ఆ యమ కింకరుల వారికి వదిలేసి హాయిగా స్వర్గంలో పూలచెట్లకిందా, చంద్రకాంత శిలల మీద కాలం గడిపేయడమేనా? పతి ఘోర విపత్తులో మునిగివున్నప్పుడు – అది యిహలోకం అయినా, పర లోకమయినా – అతన్ని వొంటరిగా వదిలి తన సౌఖ్యాన్ని మాత్రమే చూసుకునే భార్య, నిజమైన పతివ్రత అవుతుందా? కాదు! కాదు! ముమ్మాటికీ కాదు. బాపమ్మ గట్టిగా అరుస్తూ మంచం మీద లేచి కూర్చుంది.

కిటికిలోంచి వచ్చిన విసురుగాలికి గోడ మీది పటం రెపరెప కొట్టుకున్నది. ఆమె బరువెక్కిన గుండెతో, అడుగులు తడబడుతూండగా, వణికే చేతిలోకి లాంతర్ను తీసుకుని ఆ వెలుగులో పటాన్ని జాగర్తగా పరీక్షించి చూసింది.

'వీడు భార్యవుండగా పరస్త్రీ పొందుకోరిన పాపాత్ముడు' - యీ మాట స్పష్టంగా ఆ దృశ్యం కింద రాసి వుంది.

భార్య లేకపోతే పరస్త్రీని కోరవచ్చా? బాపమ్మకు యీ ధర్మసందేహం హఠాత్తుగా కలిగింది. లాంతర్ను కిందపెట్టి, ఓ నిమిషం ఆలోచించింది. కాని ఆమెకు సరైన సమాధానం దొరకలేదు. తిరిగి మంచం మీదకెళ్ళి పడుకూంటూ, 'యిక ఆలోచించి లాభం లేదు. ఆయన నరకానికి వెళ్ళడం, ఆ బాధలూ, హింసలూ అనుభవించడం తప్పదు. ఆయన అటువంటి కష్టాలు అనుభవిస్తుంటే నేను హాయిగా స్వర్గంలో కాలం గడపలేను. నేనూ ఏదో ఘోరపాపం చేస్తాను. నరకంలో కూడా ఆయనకు అండగా, నిజమైన ధర్మపత్నిగా వుంటాను' అనుకుంది.

బాపమ్మ యీ నిర్ణయానికి రాగానే, మరో సమస్య ఎదురైంది.

కణతల్ని గట్టిగా పట్టుకుని, తలను దిండుకేసి గట్టిగా కొట్టుకుంటూ, 'ఏ పాపం చెయ్యగలను? ఏం చేస్తే చాలా - చాలా ఘోరమైన పాపం అవుతుంది?' - ఆమె తేలిగ్గా చేయగలిగిన పాపం కోసం ఆలోచించసాగింది.

రోజూ బడికి వెళ్ళేటప్పుడు మంచినీళ్ళ కోసం తన యింట్లోకి వచ్చే చలమయ్యగారి ఐదేళ్ల కుర్రాడిని గొంతుపిసికి చంపితే? లేకపోతే శాస్త్రిగారి నాలుగో కూతురు, ఆ రెండేళ్ళ శాంతనీ ఎత్తి బావిలో పడేస్తే?

బాపమ్మకు యీ రెండు పనులూ చేయడం ఎంత తేలిగ్గా కనబడినయ్యో, అందువల్ల రాబొయ్యే పాపం కూడా అంత స్వల్పంగానే కనబడింది. ఆఖరికి పటంలో కూడా యిలాంటి పాపాలకి స్వల్ప శిక్షలే విధించినట్టు కనబడుతోంది.

పైగా నరకంలో ఒకో రకమైన నేరానికి ఒకో చోటును ప్రత్యేకించినట్టు తెలుస్తోంది. ఆ పద్ధతిలో తన భర్త ఒకచోట బాధపడుతూంటే, తను మరోచోట శిక్షింపబడతూండడం జరగవొచ్చు. అలా జరిగితే తను ఆయన్ని ఓదార్చడం ఎలా? నిజమైన ధర్మపత్నిగా పక్కన వుండి ధైర్యం చెప్పడం ఎట్లా? ఆమె పెదాలు గట్టిగా బిగించి ఎదురుగా వున్న పటం వైపుకు చూసింది.

రోడ్డుకు అవతల శివాలయంలో కాపరం పెట్టిన గుడ్లగూబ పెద్దగా అరిచింది. వంటగదిలో పొంచిపట్టుకున్న పెద్ద ఎలుకను నోట కరచుకుని వచ్చి, బాపమ్మ పెంపుడు పిల్లి పందిరి మంచం కింద చేరి దాని బొమికల్ని పటపట కొరికింది. పెద్దగాలి కిటికీలోనుంచి లోపల ప్రవేశించి, హరికేన్ లాంతర్ని గప్‌మనిపించింది. ఆమె తలను కాటు వేయబోయే పాములాగా రెండుమార్లు పక్కలకు తిప్పి, 'అంతే' అంటూ నిటారుగా ఎత్తింది.

ఇక ఆ రాత్రికి బాపమ్మ నిద్దరపోలేదు - ఆలోచించను కూడా యిక ఏమీ లేదు. ఆమె ఓ నిర్ణయానికి వచ్చింది. ప్రపంచంలో స్త్రీ జాతి చేయగలిగిన పాపాలు అన్నిటి కంటే దారుణమైందీ, ఆఖరిదీ అయిన మహాపాపాన్ని చేయడానికి నిశ్చయించుకున్నది. అంత పాపాన్నీ పత్నిగా, పతివ్రతగా - యీ ఇహలోకంలోనే కాక, ఆఖరికి ఆ నరకలోకంలో కూడా తనకు తాళి కట్టిన పురుషుడి కష్ట సుఖాల్లో భాగం పంచుకునేందుకూ, అతడికి నరక బాధల్ని సహించేందుకు అవసరమైన ధైర్యాన్నీ,

బలాన్నీ ఎప్పటికప్పుడు పక్కన వుండి యిస్తూండేందుకు ఆమె చేయదలచుకున్నది.

తెల్లవారుఝామున కోడి కూతతోపాటు బాపమ్మ మంచం దిగింది. నిర్మల శాంతితో, నిశ్చల నిర్ణయంతో యిక ఏ ఆలోచనలూ లేకుండా ఆమె గృహకృత్యాలు నిర్వహించ ప్రారంభించింది. ఆమె దృష్టి అప్పుడప్పుడూ గోడ గడియారం మీదికి మాత్రం పోతూండేది. ఖచ్చితంగా ఏడు గంటలకల్లా, శాస్త్రిగారి పెద్దకొడుకు శంకరం - ఆ పద్ధెనిమిదేళ్ళ కుర్రకుంక - పూలకోసం వస్తాడు. దొడ్లో పూలన్నీ కోసుకోనిచ్చి....తరువాత....గదిలో... అంతే!

మామూలు ప్రకారం ఏడు గంటలకల్లా శంకరం బుట్ట తీసుకువచ్చాడు. అతణ్ని దొడ్లోకి పోనిచ్చి, పూలన్నీ కోసుకున్న తరవాత తిరిగి వచ్చేవరకు బాపమ్మ దొడ్డి గుమ్మంలోనే నిలబడింది. ఆమె మనస్సు నిశ్చలంగా ఒకేచోట లగ్నమైవుంది. శంకరాన్ని గదిలోకి తీసుకెళ్ళడం...పందిరి మంచం....తరవాత తన భర్తతో యీ లోకంలోనే కాక - పరలోకంలో కూడా అవిచ్ఛిన్నంగా కలిసి కాలాన్ని వెళ్ళబుచ్చడం.

బుట్టనిండా పూలు కోసుకుని, కూనిరాగం తీస్తూ శంకరం ద్వారాన్ని సమీపించాడు.

ఆమె చేయి చాపి బుట్టలో పూలు తీసుకుంటూ, "శంకరం! నీతో పని వుందోయ్. యిటురా!" - ఆమె గది వైపుకు నడుస్తూ అన్నది.

"ఏం పని?"

"రా! చెపుతా"

అతణ్ని గదిలోనికి రానిచ్చి, తలుపు గడియ వేసింది.

శంకరం భయంగా తలుపు వంక చూస్తూ, "ఏం పని? తలుపు వేశావెందుకు?" అన్నాడు.

"చిన్నపనోయ్! చాలా చిన్న పని! నీకు తెలీదూ?"

బాపమ్మ నవ్వుతూ అతడి దగ్గరకు వచ్చి, రెండు చేతులూ పట్టుకొని దగ్గిరకు లాక్కున్నది. అతడికి కలిగిన ఆ భయం కాస్తా యిట్టే ఎగిరిపోయింది. యీ రకమైన ఘట్టాల్ని తెరమీద చూపదగినంతవరకు ఫిల్ము కంపెనీ వాళ్ళు చూపగా, యిదివరకు అనేకమార్లు చూసి, వాళ్లు ప్రదర్శించకుండా వదిలేసిన కత్తిరింపుల కోసం, వీలుంటుందనుకొన్న ప్రతిచోటా ప్రయత్నం చేస్తున్న అతడికి, హఠాత్తుగా ఆ తెగిపోయిన ముక్క టిక్కెట్టు ఖర్చు కూడా లేకుండా దొరికినట్ల యింది. ఆ పతివ్రతకు, ఆపైన ఎక్కువ శ్రమను యిచ్చి అతను పాపం కట్టుకోలేదు.

ఆ రోజల్లా ఆమె చాలా వుత్సాహంగా కాలం గడిపింది. తల మీది నుంచి ఓ గొప్ప భారం దిగిపోయినట్టుగా తోచింది. గదిలోని అన్ని దేవుళ్ళ పటాలనీ, ఆ నరకలోకం పటంతోసహా, ఓ కట్టగా కట్టి పాతసామాన్ల గదిలో ఓ మూల పడవేసింది. యిక ఆ దేవుళ్ళతో, దయ్యాలతో తనకు పనిలేదు. తన భవిష్యత్తు తన భర్త భవిష్యత్తు లాగానే యీ లోకంలో, పరలోకంలో కూడా నిర్ణయమైపోయింది.

ఆ రాత్రి ఆమె ప్రశాంతంగా నిద్దరపోయింది.

మరసటి దినం ఉదయం మామూలుగా శంకరం వచ్చాడు. నిన్నటిలాగే ఆమె అతణ్ని గదిలోకి

తీసుకుపోయి తలుపు వెయ్యలేదు. శంకరమే ఆమెను వంటగదిలో గ్లాసులూ, చెంబులూ సర్దుకుంటుండగా వచ్చి, గట్టిగా చెయ్యి పట్టుకొని గదిలోకి లాక్కుపోయాడు. ఆమె మాటాడకుండా అతడితో వెళ్ళింది.

శంకరం వెళ్ళిన తరవాత ఆమెకు మరో సంశయం కలిగింది. నాలుగు సంవత్సరాల భర్త పాపం, ఎప్పుడూ తన పాపానికన్న అధికంగానే వుంటుంది. ఆ నాలుగు సంవత్సరాల ఎడాన్నీ తనెప్పుడూ భర్తీ చేసుకోలేదు. యీ హెచ్చుతగ్గుల్ని ఆధారంగా తీసుకొని, యముడు తన అర్హతని శంకించడు గదా?

ఆ పగలల్లా బాపమ్మ యీ కొత్త సమస్యతో తలబద్దలు కొట్టుకొన్నది. కాని పరిష్కార మార్గం కనబడలేదు, తను యింకో శరీరాన్ని లేక మరో యిద్దర్ని తెచ్చుకుంటే...?

మరుసటి రోజు సరిగా భర్త వచ్చేవేళకు ఆమె మామూలుగా వాకిట్లో నిలబడింది.

రైలు దిగిన జనమంతా గుంపులుగా వెళ్ళిపోతున్నారు. ఆమె అలాగే వాకిట్లో నుంచుని రోడ్డు మూలకు చూస్తోంది.

నాగేంద్రం, పక్కన మరో విభూది రేఖల బ్రాహ్మడితో కలిసి వస్తున్నాడు. బాపమ్మ ఓ క్షణం ఆ వైపుకుచూసి, కాళ్ళకు నీళ్ళు తెచ్చేందుకు లోపలకు వెళ్ళింది.

తిరిగి రెండు చెంబులనీళ్ళతో ఆమె వాకిట్లోకి వస్తూండగా గోపాలరం అంటున్నాడు.

"నాకు జీవితం మీదే విరక్తి పుడుతూ వుందండి! నాలుగు సంవత్సరాల నుంచీ యీ దౌర్భాగ్యపు జీవితం గడుపుతున్నాను. చేసుకున్న భార్య ఎంత బాధపడుతూ వుందో యీనాటి వరకు గ్రహించలేక పోయాను"

"ఫరవాలేదు. యిప్పటికైనా మంచి మార్గానికి వచ్చారు" – ఆ బ్రాహ్మడు అంటున్నాడు.

బాపమ్మ యిచ్చిన నీళ్ళ చెంబు అందుకుంటూ నాగేంద్ర తిరిగి ఆయన్ని ప్రశ్నించాడు.

"యికముందు సరే! యిప్పటి వరకు చేసిన పాపం ఎలా పోతుందంటారు?"

"అన్ని పాపాలు ఎగిరిపోతాయ్! రామనామంలో వున్న అద్భుతం అదే! అజామీళుడి కథ మీకు తెలిసే వుంటుంది. అంత క్రూరకర్ముడు చచ్చే సమయంలో పెంపుడు చిలుకను 'నారాయణా' అని పిలిచినంత మాత్రాన, పాపపరిహారమై స్వర్గానికి పోయాడు"

"అది కృష్ణశతకంలో చదివిన గుర్తు. ఇంతకీ మీరు చెప్పేదానికి గట్టి ఆధారాలు వున్నయ్యా?"

"ఆధారాలు చాలావున్నై. ముఖ్యంగా ముండకోపనిషత్తూ, తరవాత పేరు గుర్తుకు రావడం లేదు. ఆఁ! షండకోపనిషత్తూ యిలాగే చెపుతున్నై"

"ఇంతకీ నన్ను ఏం చేయమంటారు?"

"తీరిక వున్నప్పుడల్లా రామనామం జపిస్తూ, ఆ పడిపోయిన శివాలయపు ధ్వజస్తంభం బాగు చేయించండి"

బాపమ్మ ఆ యిద్దరి సంభాషణా యింతవరకు విని, యిక అక్కడ వుండలేక గదిలోకి పోయి ఏడుస్తూ కూర్చున్నది. ఆమెకు కథంతా అడ్డం తిరిగినట్టుగా కనబడింది. తను భర్త కోసం అంత

త్యాగం చేసి నరక బాధల్ని అతడితోపాటు సహించేందుకు తయారైతే, అతడు స్వర్గానికి వెళ్ళేందుకు మార్గాలు వెతుక్కుంటున్నాడు.

స్వామి వారిని పంపి నాగేంద్రం గదిలోకి వెళ్ళాడు.

బాపమ్మ జుట్టంతా చిందర వందర చేసుకొని ఏడుస్తోంది.

అతడు జాలిగా ఆమె పక్కన కూర్చుంటూ, "నిన్ను చాలా బాధపెట్టాను బాపీ! యిక ఆ పాపపు మార్గాన్ని వదిలేశాను. యిందాక ఆ వచ్చిన వారితో నా సంభాషణ వినేవుంటావ్" అన్నాడు.

బాపమ్మ తల పీక్కుంటూ, "అయితే నన్నూ ఆ పాప పంకిలాన్నుంచి రక్షించి కాపాడండి. మీరు స్వర్గంలో సుఖిస్తూండగా, నేను నరకంలో బాధపడలేను" అన్నది.

నాగేంద్రం ఆమె నడుం చుట్టూ చేయి పోనిచ్చి బుజ్జగిస్తూ, "నీవు మహా పతివ్రతవు కానీ నువ్వు చేసిన పాపం ఏమీ లేదు. నేనే పాపాత్ముణ్ణి" అన్నాడు.

"నేనూ పాపాత్మురాల్నే? మీ కోసం.... ఆ శాస్త్రిగారి.... శంకరంతో.... పాపం చేశాను"

నాగేంద్రం ఆమె నడుం మీద నుంచి చెయ్యి లాక్కుని, కోపంగా, అనుమానంగా చూస్తూ, "ఏం జరిగింది? చెప్పు! త్వరగా చెప్పు!" అన్నాడు.

"మీరు మీనాక్షితో చేసే పాపం వల్ల నరకానికి వెళ్ళడం నిశ్చయం అనుకుని నేనూ మీ ధర్మపత్నిగా, మీతో పాటు కష్టాల్ని అనుభవించేందుకు, ఆ నరకంలో కూడా మీతో కలిసి వుండేందుకు.... ఆ శంకరంతో..... యిక్కడే.... యీ మంచం మీదే....."

కుడిచేతి గుప్పెటిని గట్టిగా బిగించి ఓమారు చేతిని వెనక్కి వూపి, తీవ్రమైన వేగంలో ముందుగా రానిచ్చి, బలంగా నాగేంద్రం ఆమె గడ్డం కింద కొట్టిన దెబ్బ కలిగించిన ప్రతిధ్వనిలో బాపమ్మ తక్కిన మాటలు కలిసిపోయినై.

ఆ దెబ్బతో ఆమె నిశ్చేతనంగా పక్కకు వరిగి పోయింది. పెద్దగా అరవనూ లేదు. కళ్ళు గట్టిగా మూసుకుని, సగం తెగి బయట వేలాడుతున్న నాలుక మీద పెదిమల్ని అటూ యిటూ కదిలిస్తూ ఏదో అస్పష్టంగా అంటోంది.

నాగేంద్రం నిబ్బరంగా అక్కడ నుంచి లేచి, తల వూపుతూ సామాన్ల గదిలోకి వెళ్ళి ఓ నిండు కిరసనాయిలు డబ్బా తెచ్చి, బాపమ్మ మీద కుమ్మరించి గది తలుపు బార్లా తీసి, బయటకు రెండడుగులు వేసి, అగ్గిపుల్ల గీసి ఆమె మీదికి విసిరాడు.

నరకజ్వాలల కంటే తీవ్రంగా, భయంకరంగా లేచిన ఆ మంటలు బాపమ్మను కనబడకుండా కప్పేయడాన్ని ఓ క్షణం చూసి, అగ్గిపెట్టెను అక్కడే వదిలి, నాగేంద్రం దొడ్డి వాకిలి తీసుకుని, దడి దూకి రోడ్డు మీదకి పోయాడు.

అతడికి అజామీళుడి కథా, శిథిలమై పోయిన శివాలయ ధ్వజస్తంభం భయపడవొద్దంటూ హామీ యిస్తున్నై!

*

*(అభిసారిక మాసపత్రిక : జనవరి, 1950)*

# దాగని రహస్యాలు

వ్యాధి విషమించే స్థితి కనపడుతోందనీ, ఆపరేషన్ తప్పదనీ ఎటుపోయి యెటువస్తుందో చెప్పలేం గనక వీలునామా రాయించడం అవసరం కావొచ్చనీ డాక్టరు చెప్పినపుడు సావిత్రి గుండె నీరైపోయింది. ఆమె ఏ జవాబూ చెప్పలేక నిలువు గుడ్లతో భర్త మూలుగు వినవస్తున్న గదివైపుకు చూస్తూ నిలబడిపోయింది.

ఇదివరకు యిలాంటి జబ్బులే రెండు మూడు మార్లు రావటం – ఏదో చిన్న ఆపరేషన్‌తోనూ, ఇంజక్షన్‌తోనూ ఓ నెల రోజులకల్లా తిరిగి కోలుకొని హాస్పిటల్ నుంచి బయట పడడం జరిగింది. సావిత్రి యీసారి కూడా అదేవిధంగా కొద్దిరోజుల్లో నయమై బయటపడతాడని ఆశిస్తూ రామారావును తిరిగి ఆ పాడుపనులలోకి పోకుండా చేసేందుకు మార్గాలూ, ఉపాయాలూ ఆలోచిస్తూండగా హఠాత్తుగా డాక్టరు వీలునామా రాయడం అవసరమైనంత ప్రమాద రోగంగా చెప్పగానే ఆమె నివ్వెరపోయి ఆలోచించే శక్తినీ జ్ఞానాన్నీ కోల్పోయింది.

"దిగులు పడితే లాభంలేదు. రెండు మూడు రోజుల్లో ఆపరేషన్ జరగాలి. వీలునామా అదీ రాయించేందుకు మీ వాళ్ళను పిలిపించండి"

భయం, దిగులూ కుంగదీస్తుండగా నిశ్చేష్టురాలై కళ్ళప్పగించి చూస్తున్న సావిత్రిని ఓమారు జాలిగా చూసి జవాబు కోసం ఏమాత్రం నిలబడకుండా – అసలు ఆమె జవాబుతో తనకు పని లేదన్నట్టుగా డాక్టరు అక్కడ నుంచి గిర్రున తిరిగి వెళ్ళిపోయాడు.

సావిత్రి అతడు వెళ్లిన వైపుకే చూస్తూ అలాగే నిలబడిపోయింది. ఆమె మనస్సు వర్తమానాన్ని అధిగమించి భవిష్యత్తులో జరగనున్న విషాదాలనీ, అవమానాలనీ, పతనాన్నీ – వాటి పరిణామాలనీ కళ్ల ముందు నిలిపి 'చూడు!' అంటోంది.

తన చేతిగాజులు భళ్ళున పగిలి జలజల రాలిపోవడం, నొసటి మీద కుంకుమ బొట్టు నిర్దాక్షిణ్యంగా తుడిచివేయబడడం, మంగలి చేతికత్తి, వృద్ధవితంతువు వెంకాయమ్మ నున్నటి గుండు మీది నుంచి జారిన సైను పంచను సవరించుకుంటూ, తన మీదకు తృప్తిగా, ఆనందంగా మరో సైను పంచను విసరడం – అన్నీ సావిత్రి నేత్రాల ముందు కదుల్లాడినై.

చిక్కబట్టిన గొంతులో దుఃఖం సుదులు తిరుగుతూండగా వణుకుతూన్న శరీరంతో కళ్ళను పైటచెంగుతో గట్టిగా మూసుకుని, చీకట్లో దారి కానక తవుళ్ళాడుతున్నట్టు అటూయిటూ రెండు మార్లు నిలుచున్న చోటనే తిరిగి, భర్త వున్న గది తలుపు వేగంగా తోసుకుంటూ సావిత్రి అతడి మంచం ముందుకెళ్ళి నిలబడింది.

రామారావు తీవ్రమైన బాధతో మూలుగుతున్నాడు. తన వ్యాధి రోజు రోజుకూ అధికం అవుతోందో, లేక తగ్గుతోందో అతడికి తెలీదు. కాని ఒకటి మాత్రం అతడికి మొదటి నుంచీ తెలుసు.